ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే అరెస్టులా?

- రాష్ట్రంలో దుర్మార్గపు పాలన
- బీఆర్ఎస్ నేతల అరెస్టులు అక్రమం
- అందర్నీ బేషరతుగా విడుదల చేయాలి
- మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం
- అరెస్టులు అప్రజాస్వామికం: బీఆర్ఎస్ నేతల మండిపాటు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే అరెస్టులు అన్నట్టుగా రా ష్ట్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలైన హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకుల అరెస్టులు అప్రజాస్వామికమని పేర్కొన్నారు. అరెస్టు చేసిన నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు, పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులా? అని నిప్పులు చెరిగారు. పాలనలో లోపాలను ఎత్తిచూపినా, గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలించేందుకు వెళ్లినా, ప్రభుత్వం భూములు లాక్కుంటుంటే ఇదేమిటని ప్రశ్నించినా, కూల్చుతున్న ఇండ్లకు అడ్డొచ్చినా, ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకొని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేసినా కేసులు పెట్టి అక్రమంగా అరెస్టులు చేయడమేనా మీ పాలన? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాసు లు మీకు – కేసులు మాకు, సూట్‌కేసులు మీకు.. అరెస్టులు మాకు' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొండాపూర్‌లోని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద గురువారం భారీగా పోలీసుల మోహరింపు

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం: ఎమ్మెల్సీ కవిత

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తున్నదని, ఎమర్జెన్సీని తలపిస్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ప్రభుత్వానికి ఫిర్యాదు తీసుకునే ధైర్యం లేదా? అని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అపాయింట్‌మెంట్ తీసుకున్నా ఏసీపీ అందుబాటులో ఉండకపోవడం, ఉన్న సీఐ ఎమ్మెల్యేను చూసి ఫిర్యాదును స్వీకరించకుండా వెళ్లిపోవాలనుకోవడం వంటి పరిణామాలు దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఫిర్యాదును తీసుకోకుండా ఉల్టా ఎమ్మెల్యేపైనే కేసు పెట్టి అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. అక్రమ కేసులు పెట్టి అకారణంగా కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేస్తున్నారంటూ వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సహా ఇతర బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేసి దౌర్జన్యానికి ఒడిగట్టారని విమర్శించారు. ప్రభుత్వం ఇదే వైఖరిని కొనసాగిస్తే, ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. ఎమ్మెల్యేలపై కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. అరెస్టు చేసిన నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు సమయం అయిపోయేదాకా కాలక్షేపం చేసి నేతలను జైళ్లో పెట్టాలన్న కక్ష ప్రభుత్వానికి ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నదని విమర్శించారు.

గుణపాఠం తప్పదు: రసమయి

కాంగ్రెస్ నిర్బంధ పాలనకు ప్రజలే గుణపాఠం చెప్తారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్పష్టం చే శారు. ప్రభుత్వ అసమర్థ వైఖరిని ప్ర శ్నిస్తే ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేయించడం, కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌రావును కలిసి ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం ప్రభుత్వ తీరుపై రసమయి నిప్పులు చెరిగారు.

అంతులేని హింస : జీవన్‌రెడ్డి

తెలంగాణలో పోలీస్ రాజ్యం కొనసాగుతున్నదని మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యమంటే అంతులేని హింస అని చెప్పారు. ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐని ప్రశ్నించినందుకు పాడి కౌశిక్‌రెడ్డిపైనే కేసులు పెట్టడం సిగ్గుచేటని పేర్కొన్నారు.అరెస్టులతో అణచివేయలేరని స్పష్టం చేశారు.

అరెస్టులతో రాష్ట్రం ఆగం: జూలూరు

పునర్నిర్మాణం జరగాల్సిన సమయంలో పాలకుల విపరీత ధోరణితో తెలంగాణ తల్లడిల్లుతుందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరి గౌరీశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టులు, దాడులు, లగచర్ల ఘటన, హరీశ్‌రావు అరెస్టులతో ఆగమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేం పాలన, ఇవేం అరెస్టులు, ఇదేనా ప్రజాపాలన అని ప్రజలు నిట్టూరుస్తున్నారని పేర్కొన్నారు.

అరెస్టులు దుర్మార్గం: వై సతీశ్‌రెడ్డి

'ఉల్టా చోర్ కోత్వాల్ కో డాంటే' అన్నట్టుగా కాంగ్రెస్ పాలనలో పోలీసుల తీరు ఉన్నదని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి విమర్శించారు. తన ఫోన్ ట్యాప్ చేస్తున్నారని ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపైనే పోలీసులు కేసు నమోదు చేయడం, అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ అక్కడికి వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డిని సైతం పోలీసులు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని తెలిపారు.

రజాకార్ రాజ్యం: రాంబల్ నాయక్

ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో తిరిగి నయా రజాకార్ రాజ్యం నడుస్తున్నదని రాష్ట్ర లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ ధ్వజమెత్తారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సహా ఇతర నేతలను కక్షపూరితంగా అరెస్టు చేశారని ధ్వజమెత్తారు. ప్రజాప్రతినిధులపైనే పోలీసులు ఈస్థాయిలో జులుం ప్రదర్శిస్తే సామాన్యులపై ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని పేర్కొన్నారు. ఈ ప్రభు త్వానికి ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చ రిం చారు. అక్రమ అరెస్టులను ఇకనైనా ఆపాల ని, కక్షసాధింపు చర్యలతో ప్రశ్నించే గొంతులను నిలువరించలేరని తెలిపారు.

ఫిర్యాదు చేస్తే కేసా? : నిరంజన్‌రెడ్డి

పోలీసులు ఎందుకు అత్యుత్సా హం ప్రదర్శిస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. ఒక ఎమ్మెల్యే అనుమతి తీసుకొని ఫిర్యాదు చేయడానికి వెళ్తే ఏసీపీ లేకపోవడం, ఉన్న సీఐ ఎమ్మెల్యే రాకను గమనించి ఫిర్యాదు స్వీకరణను నిరాకరించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఫిర్యాదును స్వీకరించకపోగా తమ విధులకు ఆటంకం కలిగించారని, తమపై దురుసుగా ప్రవర్తించారని కేసులు పెట్టడం వెనుక ప్రభుత్వం ఒత్తిడి ఉన్నట్టు స్పష్టం అవుతున్నదని పేర్కొన్నారు.

నిర్బంధం సాగదు : శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మాజీ మంత్రి వీ. శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సహా నేతల అరెస్టులు అప్రజాస్వామికమని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో పాలన ఎంతోకాలం సాగదనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని హితవు పలికారు. ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీ పాలనా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసే దాకా వెంటపడతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ పతనమే: తాతా మధు

హామీలను తుంగలో తొక్కి ప్రజా వ్యతిరేకతకు మూటగట్టుకున్న కాంగ్రెస్ సర్కార్ పతనం మొదలైందని ఎమ్మెల్సీ తాతా మధు హెచ్చరించారు. పాలన చేతగాక ప్రశ్నించేవారిపై కేసులు పెట్టి అక్రమంగా అరెస్టులు చేయడమే పాలనా? అని ప్రశ్నించారు. ప్రజాపాలన అని చెప్తూ ప్రజాగొంతుకలను నొక్కుతున్న వైనాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొరివితో తలగోక్కోవద్దని హెచ్చరించారు.

తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

శాసనసభలో నిలదీస్తారనే అరెస్టులు

- గాంధీభవన్ ఆదేశాలతో ఎఫ్ఐఆర్‌లు నమోదు
- పోలీసులను అడ్డంపెట్టుకొని రేవంత్ అరాచకాలు
- ఎంతమందిని అరెస్టు చేస్తవ్ సీఎం రేవంత్‌రెడ్డీ?
- బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిలదీత

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో నిలదీస్తారనే భయంతో ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, కొడంగల్ నుంచి కోదాడ దాకా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 9 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో అధికార కాంగ్రెస్ పార్టీని ఉతికి ఆరేస్తారనే భయంతో జైలుకు పంపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ హక్కులు కాపాడాల్సిన పోలీసులు, సీఎం రేవంత్‌రెడ్డికి కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో గురువారం ఆయన బీఆర్ఎస్ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, రంగినేని అభిలాష్, మనోహర్‌రెడ్డి, గోపగాని రఘురామ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న పోలీసులు కొందరు కాంగ్రెస్, రేవంత్ ప్రొటెక్షన్ ఫోర్స్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గాంధీభవన్ ఆదేశాలతో, కాంగ్రెస్ లీగల్ సెల్ కంటెంట్‌తో బీఆర్ఎస్ నేతలు, సోషల్ మీడియా వారియర్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక అక్రమ కేసులను రద్దు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయని, రేవంత్ సోదరులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా మారడం తెలంగాణ ప్రజల దురదృష్టమని వాపోయారు. తనకు ప్రాణహాని ఉన్నదని, ఫోన్ ట్యాప్ అవుతున్నదని ఫిర్యాదు చేయడానికి వెళ్లిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పైనే ఉల్టా కేసు పెట్టడం హాస్యాస్పదమని మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డిని అరెస్ట్‌చేసి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2 లక్షల మంది ప్రజలకు ప్రతినిధి అయిన కౌశిక్‌రెడ్డికి రక్షణ కల్పించని పోలీస్‌శాఖ, వార్డు సభ్యులు కూడా కాని రేవంత్ సోదరులకు మాత్రం భారీ కాన్వాయ్‌తో భద్రత కల్పిస్తున్నదని విమర్శించారు.

ఫిర్యాదు చేస్తే కేసులెందుకు పెట్టరు?

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఫినిష్ చేస్తామని ఇష్టమొచ్చినట్టు రేవంత్‌రెడ్డి తిట్టారని, ఆయనపై బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం కేసు ఎందుకు పెట్టడం లేదని ప్రవీణ్ కుమార్ నిలదీశారు. రేవంత్‌రెడ్డిపై, ఆయన సోదరులపై కేసు పెట్టడానికి పోలీసులు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఇవ్వని వాంగ్మూలాన్ని ఇచ్చినట్టు మార్చారని, 25 రోజులుగా ఆయనను కుటుంబానికి దూరం చేశారని మండిపడ్డారు. హామీలపై నిలదీసిన ఎంతమందిని అక్రమ కేసులతో అరెస్టు చేసి జైళ్లకు పంపుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో జైళ్లలో ఉండాల్సిన ఖైదీల సంఖ్య ఏడు వేలు మాత్రమేనని, తెలంగాణలోని 4 కోట్ల మంది ఎదురుతిరుగుతున్నారని, వారిని ఏ జైళ్లలో పెడతారని నిలదీశారు. బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి తెల్లవారుజామున, రాత్రి పూట జడ్జిల ముందు నిలబెడుతున్నారని, కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా ఈ ప్రభుత్వ వైఖరి మారడం లేదని మండిపడ్డారు. పోలీసుల పక్షపాత వైఖరిని డీజీపీ, రాష్ట్ర ప్రజలు గమనించాలని కోరారు. అక్రమంగా అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిపక్షాల గొంతునొక్కే యత్నం: కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, డిసెంబర్ 5: ప్రభుత్వ తప్పులను ప్రశ్నించకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులను ఖండించారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తున్నదని విమర్శించారు. హామీలను నెరవేర్చాలని అడిగితే కేసులు నమోదు చేస్తారా? అని నిలదీశారు. పోలీసులను ముందు పెట్టుకొని ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయిస్తున్నదని విమర్శించారు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపైనే కేసు పెట్టడమేమిటని ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసులు పెట్టారని, కేటీఆర్ పైనా కేసులు పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు.

హక్కుల ఉల్లంఘన: సుంకె

గంగాధర, డిసెంబర్ 5: రేవంత్‌రెడ్డి సర్కారు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కౌశిక్‌రెడ్డిపై అక్రమ కేసులు, హరీశ్, జగదీశ్‌రెడ్డి ఇతర బీఆర్ఎస్ నేతల అరెస్టులను ఖండించారు. రాష్ట్రంలో పాలన ఎమర్జెన్సీని తలపిస్తున్నదని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజల పక్షాన చేస్తున్న పోరాటాన్ని భరించలేకే ఆయనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని దుయ్యబట్టారు.

అరాచక పాలన: రవీందర్

మహబూబాబాద్, డిసెంబర్5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తూ ఏపీ సీఎం చంద్రబాబు చేతిలో తెలంగాణను పెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి కుయుక్తులు పన్నుతున్నారని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు విమర్శించారు. మహబూబాబాద్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధుల మీద అక్రమ కేసులు పెడుతూ రేవంత్ రెడ్డి రాక్షస ఆనందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, తదితర నాయకుల అరెస్టులను ఖండించారు.

కాంగ్రెస్‌ది పాశవిక చర్య: బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుతో కాంగ్రెస్ ప్రభుత్వ పాశవిక చర్యలు పరాకాష్ఠకు చేరాయని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అగౌరవపర్చడమే కాకుండా ఆయనపైనే కేసు నమోదు చేయడం చూస్తుంటే రేవంత్‌రెడ్డి పోలీసు రాజ్యం నడిపిస్తున్నారని అర్థమవుతందని తెలిపారు. కౌశిక్‌రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లిన నేతలను అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, కౌన్సిలర్ తాహేర్ పాల్గొన్నారు.

కక్షసాధింపు: రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), డిసెంబర్ 5: హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీ ఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. దేవరకొండలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అక్రమాలను ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నేతలపై కేసులు పెడుతూ, కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. అక్రమ కేసులకు అదిరేది లేదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

నిర్బంధ పాలన : చిరుమర్తి

చిట్యాల, డిసెంబర్ 5: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ధ్వజమెత్తారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రజాపాలన ఏడాది ఉత్సవాలు కాదని, నిర్బంధ పాలనకు ఏడాది పేర ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజావ్యతిరేక పాలనపై నిరసన చేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా నిర్బంధిస్తూ రేవంత్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఎగతాళి చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు 11 నెలలకే విసుగెత్తారని తెలిపారు.

ఎమర్జెన్సీ కన్నా దారుణం: గంగుల

కరీంనగర్ కార్పొరేషన్, డిసెంబర్ 5: 'రాష్ట్రంలో ఎమర్జెన్సీ కంటే దారుణమైన పరిస్థితులు ఉన్నాయని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రతినిధుల గొంతులను కూడా నొక్కుతున్నదని, ఎమ్మెల్యేలకు కనీస స్వాతంత్ర్యం లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, ఇలాంటి అరెస్టులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రజలే కాంగ్రెస్‌కు తగిన రీతిలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరును సహించేది లేదని, ఎక్కడికక్కడ నిరసనలు తెలుపుతామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు హేయం

- దాసోజు శ్రవణ్

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టి ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నదని బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంట్లోకి పోలీసులు అనుమతి లేకుండా చొరబడి, తలుపులు పగలగొట్టి అరెస్టు చేయడం రేవంత్‌రెడ్డి నిరంకుశ పాలనకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చిన కౌశిక్‌రెడ్డిపై ఉల్టా కేసు పెట్టి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హరీశ్‌రావుపై ఒక చీటర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, జైలుకు పంపేందుకు కుట్ర పన్నడం అన్యాయమని ఆక్షేపించారు. 'ఎంత మందిని అరెస్టు చేస్తావ్ రేవంత్‌రెడ్డి? పదేండ్లు ప్రతిపక్షంలో ఉన్నవ్. మిమ్మల్ని ఎన్నిసార్లు అరెస్టు చేయాలి? మీ సోదరుల దాష్టీకాలపై నోరు ఎందుకు మెదడం లేదు?' అని రేవంత్‌రెడ్డిని నిలదీశారు.

కౌశిక్ రెడ్డిని తక్షణమే విడుదల చేయాలని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యేలు వివేకానంద, సంజయ్, బండారు లక్ష్మారెడ్డి, పార్టీ నేత శ్రీధర్‌రెడ్డి తదితరులు

అక్రమ అరెస్టులకు భయపడం

- దుర్మార్గ పాలనకు ప్రజలే చరమగీతం పాడుతరు: సిరికొండ
- నిరసనగా అంబేద్కర్‌కు నివాళులర్పిస్తాం: వేముల
- సీఎం, ఆయన సోదరులపై కేసెందుకు పెట్టడం లేదు ?: సబిత
- వలసవాదులకన్నా దుర్మార్గంగా రేవంత్ పాలన : పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- నిలదీస్తే అరెస్టులా? జైల్లో వేసినా విడిచిపెట్టం: దయాకర్‌రావు

ప్రజలే చరమగీతం పాడుతరు : సిరికొండ

రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, పాపాల పాలన అని శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక ఏడాది కాలంలోనే అనేక పాపాలు చేస్తున్నాడని మండిపడ్డారు. తాను మాట్లాడిన మాటలను తానే వక్రీకరిస్తూ తెలంగాణ ప్రజలకు సీఎం తీరని ద్రోహం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ దుర్మార్గాన్ని అడుగడుగునా నిలదీస్తున్న హరీశ్‌రావు, కేటీఆర్ ఇతర బీఆర్ఎస్ నేతలపై కక్ష పెంచుకొని కావాలనే కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని, ప్రభుత్వాన్ని నిలదీస్తే సమాధానం చెప్పాల్సిందిపోయి అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. శిశుపాలుడికి వంద తప్పుల తర్వాత శిక్ష పడినట్టుగానే కాంగ్రెస్ పార్టీని, రేవంత్‌రెడ్డిని ప్రజలు తప్పకుండా శిక్షిస్తారని హెచ్చరించారు.

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేతలు, అక్రమ అరెస్టులకు భయపడేదిలేదని బీఆర్ఎస్ నేతలు తేల్చిచెప్పారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. నియంత పాలనను తలపించేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని భగ్గుమన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, తాతా మధు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శేరి సుభాశ్‌రెడ్డి, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, చింతా ప్రభాకర్, డాక్టర్ సంజయ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్, మర్రి జనార్దన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, పల్లె రవి, దేవీప్రసాద్ సహా పలువురు పార్టీ నేతలు హరీశ్‌రావును కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మీడియాతో మాట్లాడారు.

వలసవాదులకన్నా దుర్మార్గం: పల్లా

వలసవాదులు చేయని దుర్మార్గాన్ని రేవంత్ సర్కార్ చేస్తున్నదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిప్పులుచెరిగారు. మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేసేటప్పుడు అనుసరిస్తున్న విధానాన్నే బీఆర్ఎస్ నాయకుల అరెస్టుల సందర్భంలో పోలీసులు అనుసరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో భాగమైన పోలీసులు రేవంత్‌రెడ్డి జీతగాళ్లుగా వ్యవహించకూడదని సూచించారు. ఉద్యమంలో అనేకసార్లు జైళ్లకు పోయినోళ్లమని, వందల కేసులు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఏ చట్ట ప్రకారం అరెస్టు చేశారో చూపకుండా ఆఖరికి పోలీస్ సర్వర్ డౌన్ చేయటం సిగ్గుచేటని, కౌశిక్‌రెడ్డి ఇంటిని చుట్టుముట్టి తలుపులు పగులగొట్టి అరెస్టు చేస్తున్న విషయాన్ని తెలుసుకొని అక్కడికి వెళుతున్న హరీశ్‌రావును పోలీసులు అరెస్టు చేశారని, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కూడా అరెస్ట్ చేశారని, ఇలా ఎంత మందిని అరెస్టు చేస్తారని ప్రశ్నించారు.

జైల్లో వేసినా వదిలేది లేదు: దయాకర్‌రావు

దేశం, రాష్ట్రం నాశనమైంది కాంగ్రెస్ వల్లేనని, ఇందిరాగాంధీ మొదలుకొని సోనియా, రాజశేఖర్‌రెడ్డి, రాహుల్‌గాంధీ దాకా ఒక్కొక్కరిని తిట్టిపోసిన రేవంత్‌రెడ్డి ఇవ్వాళ ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందని చెప్పటం సిగ్గుచేటని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది, అభివృద్ధి జరిగింది కేసీఆర్ నాయకత్వంలోనేనని స్పష్టంచేశారు. రేవంత్ రెడ్డి మోసకారి అని దేశమంతా తెలుసని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు నిలదీస్తే అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. అరెస్టు చేసినా, దెబ్బలు కొట్టినా..జైల్లో పెట్టినా రేవంత్‌రెడ్డిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఏడాదిలోనే లక్ష కోట్ల అప్పు చేసిన రేవంత్‌కు అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కులేదని దుయ్యబట్టారు.

సీఎం బ్రదర్స్‌పై కేసు పెట్టరా?: సబిత

కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తన చావుకు సీఎం, ఆయన సోదరులు కారణమని సూసైడ్‌నోట్‌లో పేర్కొన్నారని, ఈ విషయంలో వారిపై కేసు ఎందుకు పెట్టడం లేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. దేశంలోఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అధికార పక్షానికి ఓ చట్టం, ప్రతిపక్షానికి మరో చట్టం అమలవుతున్నదని విమర్శించారు. లగచర్ల బాధితుల అక్రమ అరెస్టులు, గురుకుల విద్యార్థుల మరణాలపై అధ్యయనం చేసేందుకు వెళ్లిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సహా ఇతర నాయకులపై కేసులు, ఆఖరికి జర్నలిస్టులపై కేసులు పెట్టడం కాంగ్రెస్ అణచివేత ధోరణిని స్పష్టం చేస్తున్నదని దుయ్యబట్టారు. హరీశ్‌రావుపై కుట్రపూరితంగా కేసు పెట్టారని, ఏసీపీ అనుమతి తీసుకొని ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేయటం దుర్మార్గమని మండిపడ్డారు.

నిరసనగా అంబేద్కర్‌కు నివాళి: వేముల

సీఎం రేవంత్‌రెడ్డి నియంత పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని ప్రతిపక్ష నాయకుడిగా తానెక్కడికైనా స్వేచ్ఛగా వెళ్తానని చెప్తుంటే ఇక్కడ రేవంత్‌రెడ్డి మాత్రం శాసనమండలి విపక్షనేత సిరికొండ మధుసూదనాచారిని ఎక్కడికీ వెళ్లనివ్వకుండా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీపాలన సాగుతున్నదని దుయ్యబట్టారు. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పార్టీ శ్రేణులంతా కలిసి ఆ మహనీయుడికి నివాళి అర్పిస్తామని చెప్పారు. రేవంత్‌రెడ్డి ఎమర్జెన్సీ రోజులను తలపించేలా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు.